క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించుకుందాం..

● ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు



వల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని జోగిరాజుపేట, అలుగోలు, బొప్పడాం, వల్లూరు, మల్యాడ, ఒమ్మి గ్రామాల్లో సోమవారం పర్యటించి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 58 నెలల పరిపాలన ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు. గత ఎన్నికల్లో నవరత్నాల పేరిట ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత శతశాతం నెరవేర్చారన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గిరిబాబు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు పింఛన్ సొమ్ము జమ

పూసపాటిరేగ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మే, జూన్ నెలల ఫించన్ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాకు జమ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వారికి ఇళ్ల వద్దే పింఛన్ అందజేస్తామన్నారు. పెన్షన్ లబ్ధిదారుల వివరాలు సచివాలయాల్లో ఉన్నాయని పేర్కొన్నారు.

ఐదో తేదీలోగా పింఛన్లు పంపిణీ చేయాలి

నెల్లిమర్ల: పంచాయతీ కార్యదర్శులు మే 5వ తేదీనాటికి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతాలు అనుసంధానం చేసుకున్న లబ్ధిదారులకు పింఛన్లు నేరుగా ఖాతాకు జమ చేయాలన్నారు. దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు, దీర్ఘకాలిక రోగులకు ఇంటివద్దే నగదు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. మండలంలోని కొత్త కొప్పెర్లలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు బాగా ఉన్నందున తెల్లటి పలచని వస్త్రాలు ధరించాలన్నారు. తల తిరగడం, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది గాడి బంగారుబాబు, ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.

ఒమ్మిలో అగ్ని ప్రమాదం

- పశువుల శాల దగ్ధం
- పాక్షికంగా దెబ్బతిన్న రెండిళ్లు
- రూ.3.50 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న పశువుల శాల, గడ్డి వాములు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దురగాశి ఎర్రంనాయుడుకు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు దట్టంగా వ్యాపించి పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో గాలులు బలంగా వీయడంతో పక్కనే ఉన్న రెండు గడ్డి వాములకు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. సమీపంలో ఉన్న రెడ్డి శ్రీరాం, దుర్గారావు స్లాబు ఇళ్లు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానికులు మంటలు అదుపు చేసేందుకు యత్నించినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో 40 ప్లాస్టిక్ పైపులు, రెండు గడ్డి వాములు, పశువుల పాక, టేకు కలప, రెండు నాటు బండ్లు, మంచినీటి ట్యాంక్ పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, బాధితుడు ఎర్రంనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు బాధితులను పరామర్శించారు.

ఎంతమంది కలిసి వచ్చినా.. విజయం జగనన్నదే...

- ప్రజా విశ్వాసం కోల్పోవడంతోనే చంద్రబాబు రాజకీయ పొత్తులు
- పరిపాలన చేయడానికి చంద్రబాబు అనర్హుడు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- వాడవాడలా ఎన్నికల ప్రచారం



47వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని ఆశీర్వదిస్తున్న మహిళ

విజయనగరం: ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు ఎన్ని పొత్తులతో కలిసి వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేరని డిప్యూటీ స్పీకర్, విజయనగరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పరిపాలన చేయడానికి చంద్రబాబు ఇక అనర్హుడన్నారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగించారని చెప్పారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కడితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47వ డివిజన్ గంజిపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో సాగిన సంక్షేమ పాలన, నగరంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సమయంలో మహిళలు హారతులిస్తూ, విజయతిలకాలు దిద్దుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి అందరి సహకారంతో జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తాజాగా ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా పేద వర్గాలకు మరింత మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డేనని కొనియాడారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు..

ఇళ్లు రిజిస్ట్రేషన్ చేస్తే ఒరిజినల్ పట్టాలు రావని ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని, అటువంటి తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలను ప్రలోభపెట్టి ఎన్నికలలో గెలవాలనే చంద్రబాబు అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యుడిగా బెల్లాన చంద్రశేఖర్‌ను, శాసనసభ్యుడిగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వి. విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ దూబే, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి చేశాం... ధైర్యంగా ఓట్లు అడుగుతున్నాం



రాకోడు ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్

● కోలగట్ల వీరభద్రస్వామి, బెల్లాన చంద్రశేఖర్



జొన్నవలస సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు మంచి చేశాం కాబట్టే ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని జొన్నవలస, రాకోడు, పినవేమలి, కోరుకొండపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ పాలనలో పారదర్శకత ఉందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు మంజూరు చేశామన్నారు. దేశ చరిత్రలోనే గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమం, ప్రభుత్వ సేవలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషి దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటియ్యాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు



రావాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సభకు హాజరైన ప్రజలు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చోటుచేసుకున్నాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని జమ్మయ్యపేట, తూడెం, రావాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ మాట్లాడుతూ.. కుల,మతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని కోరారు. చంద్రబాబునాయుడి మోసపూరిత హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. జనసేన అభ్యర్థి మాధవి ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వస్తుంటారని, ఎన్నికలు ముగియగానే తిరిగి అమెరికా వెళ్లి పోతారని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబునాయుడు ఈ ప్రాంతంలోని రైతులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించకుండా ఎన్నికల లబ్ధి కోసం హడావిడిగా విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో రైతులకు నష్ట పరిహారం చెల్లించడమే కాకుండా గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు కోసం గూడెపువలస, లింగాలవలస సమీపంలో సకల సౌకర్యాలతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 130 సార్లు బటన్ నొక్కారని.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీరు ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి తనను ఎమ్మెల్యేగా.. బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, దంతులూరి రావాడబాబు, ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, అప్పురభుక్త పైడినాయుడు, కొండపు కొత్తయ్యరెడ్డి, కొండపు రాజారెడ్డి, దాట్ల శ్రీనురాజు, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, వెంకటపతిరాజు (రమేష్‌రాజు), దంతులూరి వాసుదేవవర్మ, కుంచం సూరప్పారావు, కొండపు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

● కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: ఎన్నికల నిబంధనావళి అమలులో ఉన్నందున మే, జూన్ నెలలకు సంబంధించిన పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం ఎం నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, మంచం, కుర్చీలకు పరిమితమైన వారికి ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందజేస్తామన్నారు. మిగిలినవారికి నేరుగా డీబీటీ విధానం ద్వారా వారి బ్యాంక్ ఖాతాలకు నగదు జమవుతుందని చెప్పారు. పింఛన్ల పంపిణీ విషయంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట గ్రామానికి చెందిన దువ్వ పైడమ్మ ఇటీవల ఉపాధి పనికి వెళ్తూ, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్టాడ అప్పలనాయుడు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కర్రోతు కూర్మారావు, బూర గోవింద పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో షటిల్ పోటీలు

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐఎంఏ సభ్యులు అధికంగా పాల్గొన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్ఓడీ ప్రసాద్, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బర్ల అజయ్‌కుమార్ ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ఐఎంఏ ప్రతినిధులు మెడల్స్ అందజేశారు.

నెల్లిమర్ల బరిలో 12 మంది అభ్యర్థులు



ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశమైన ఆర్‌ఓ నూకరాజు

● ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. వారిలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మిగిలిన 13 మందిలో కోలా వర్షిణి అనే అభ్యర్థి సోమవారం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. దీంతో 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బరిలో నిలిచిన వారిలో బడ్డుకొండ అప్పలనాయుడు (వైఎస్సార్‌సీపీ), లోకం నాగ మాధవి (ఎన్డీయే కూటమి), సరగడ రమేష్‌కుమార్ (కాంగ్రెస్), ఎరుకొండ తేజారాణి (బీఎస్పీ), కర్రి కృష్ణ (ఎస్పీ), నడిపేన శ్రీను (అఖిల భారతీయ జన సంఘ్), టొంపల నరసయ్య (జై భీమ్‌రావు భారత్), మజ్జి నాగమణి (జాతీయ జనసేన), లెంక మాధవి (నవరంగ్ కాంగ్రెస్) ఆదపాక సూరిబాబు (రిపార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా), జేయేషు (స్వతంత్ర), పసుపులేటి సత్యప్రసాద్ బాబు (స్వతంత్ర) ఉన్నారు. వచ్చే నెల 13న ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే.

విజయనగరంలో 15 మంది..

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. ఈ నెల 19న నామినేషన్లు ప్రారంభమైనప్పటి నుంచి విజయనగరం అసెంబ్లీ స్థానానికి 20 నామినేషన్లు రాగా 4 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 16 నామినేషన్లు అధికారులు ఆమోదించగా స్వతంత్ర అభ్యర్థి మండలి శ్రీనివాసరావు తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో 15 మంది బరిలో నిలిచారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, తెలుగుదేశం పార్టీ నుంచి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పూసపాటి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి సుంకరి సతీష్‌కుమార్, బీఎస్పీ నుంచి ఆర్జి శివప్రసాద్, జాతీయ జనసేన పార్టీ నుంచి కాళ్ల సూరిబాబు, జైభీమ్‌రావ్ భరత్ పార్టీ నుంచి చింతపల్లి దుర్గారావు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి కరుణాకర్ పెనుమత్స, అఖిల భారతీయ జనసంఘ్ నుంచి పోలిపల్లి కిరణ్‌కుమార్, యుగ తులసి పార్టీ నుంచి ఎంబీ గురునాథశర్మ పోటీలో నిలిచారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా సురేష్ కందివలస, మీసాల గీత, భాస్కరరావు చింతపల్లి, దుద్దు వెంకటరమణ, పడాల ఆదినారాయణ, పాండ్రంకి వెంకటరమణ నిలిచారు.

మీసాల గీతకు గాజు గ్లాసు..

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రెబల్ అభ్యర్థి మీసాల గీతకు గాజు గ్లాసు గుర్తు (గ్లాస్ టంబ్లర్) కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాస్ గుర్తు కావడం, ఈ గుర్తును తమ రెబల్ అభ్యర్థికి కేటాయించడంతో టీడీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తమతో పొత్తు ఉన్న జనసేన పార్టీ గుర్తు స్వతంత్ర అభ్యర్థికి కేటాయించడంతో తమ ఓటు బ్యాంకుపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. అయితే తనకు గాజు గ్లాస్ గుర్తు రావడం పట్ల స్వతంత్ర అభ్యర్థి మీసాల గీత సంతోషం వ్యక్తం చేశారు.

జనం మెచ్చిన నాయకుడు జగన్

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



విజయనగరం: 41వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి , తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జనం మెచ్చిన నాయకుడని.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 41వ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో కోలగట్లను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించి, జగనన్నకు మద్దతు తెలియజేయాలని సూచించారు. అంతకుముందు స్థానిక మహిళలు శ్రావణికి పూలమాలలు వేసి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి, కోఆప్షన్ సభ్యుడు రహీం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి..



డెంకాడ: డి.తాళ్లవలసలో ఇంటింటి ప్రచారంలో ఎంపీపీ వాసుదేవరావు, ఐటీ జోన్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, వైస్ ఎంపీపీ తమ్మునాయుడు తదితరులు



విజయనగరం: 37వ డివిజన్‌లో కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపడుతున్న ఈశ్వర్‌కౌశిక్, రామకృష్ణ, తదితరులు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జోన్-2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని డి.కొల్లాం, టి.కల్లాలు, కొండరాజుపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేశారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు విడితల వారీగా రుణమాఫీ మొదలుకుని అమ్మఒడి, తదితర పథకాల ద్వారా ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు రైతుభరోసా, సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, సరగడ కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సరగడ బంగారురెడ్డి, అట్టాడ వెంకటరమణ, మంగమ్మ, వెంకటరెడ్డి, బంటుపల్లి సత్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో కోలగట్లకు మద్దతుగా ప్రచారం

విజయనగరం: నగరంలోని 37వ డివిజన్ బీసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 37వ డివిజన్‌లో ఎన్నడూ లేనంత అభివృద్ధి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరిగిందన్నారు. బీసీ కాలనీ నిరాదరణకు గురై ప్రజలు తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్న సమయంలో.. కోలగట్ల వాటర్ ట్యాంక్ నిర్మించి ఆదుకున్నారన్నారు. రానున్న రోజుల్లో నగరం మరింత అభివృద్ధి చెందాలంటే కోలగట్లను గెలిపించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మిందే రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ రేపు

భోగాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మే ఒకటో తేదీన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల విషయంలో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.